

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 2: వినాయక నవరాత్రులు, మిలాద్-ఉన్-నబీ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం వివిధ మతాల పెద్దలు, అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. నవరాత్రులు, నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

5 ఖాళీలు.. 500 దరఖాస్తులు

ఐఐటీహెచ్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగాలకు పోటెత్తిన నిరుద్యోగులు



దరఖాస్తులు అందజేయడానికి ఐఐటీహెచ్ గేటు వద్ద నిరీక్షిస్తున్న నిరుద్యోగులు

కంది, సెప్టెంబరు 2 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవడానికి నిరుద్యోగులు పోటెత్తారు. హౌస్‌కీపింగ్ విభాగంలో 5 ఖాళీలను భర్తీ చేయడానికి అధికారులు నియామకాలను చేపట్టారు. వేతనం రూ.18 వేలకు పైగా ఇస్తారని తెలియడంతో సంగారెడ్డి, కంది, చిమ్నాపూర్, కాశీపూర్, చేర్యాల, ఎద్దుమైలారం, జుల్‌కల్, మామిడిపల్లి, తునికిళ్లతండా, రుద్రారం పటాన్‌చెరు గ్రామాల్లోని టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వందలాది మంది నిరుద్యోగులు సోమవారం తమ బయోడేటాలను పట్టుకొని ఐఐటీహెచ్‌కు వచ్చారు. ఐఐటీహెచ్ ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్లకు తమ బయోడేటాలను అందజేశారు. దీంతో ఐఐటీహెచ్ మెయిన్ గేట్ ప్రాంగణమంతా ద్విచక్ర వాహనాలు, ఆటోలతో నిండిపోయింది. 35 సంవత్సరాల లోపు వయసున్నవారు మాత్రమే అర్హులని అధికారులు తెలపడంతో చివరికి 500 దరఖాస్తు చేసుకున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

మంజీరా డ్యామ్‌ను సందర్శించిన మంత్రి దామోదర, జగ్గారెడ్డి

వర్షాలపై కలెక్టరేట్‌లో అధికారులతో అత్యవసర సమావేశం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 2 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ సమీపంలోని మంజీరా బ్యారేజీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందోల్, న్యాల్‌కల్, బొల్లారం తదితర మండలాల్లో అధిక వర్షపాతం నమోదైనందున ఆయా ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని మంజీరా బ్యారేజ్ పూర్తిగా నిండి కిందికి నీటిని వదులుతుండడంతో తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. చెరువులు, వాగులు, వంకల వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నట్టు తెలిపారు. రానున్న 48 గంటల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని కోరారు. దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. కల్పగూర్ గ్రామ పరిధిలోని అంగడిపేట గ్రామంలో వర్షానికి కూలిన ఇంటిని మంత్రి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో వర్షాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వారివెంట టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మంజీరా డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి



హవేళీఘనపూర్ చెరువుకు గండి పడి పంట పొలాలను ముంచెత్తుతున్న నీరు



జహీరాబాద్ మండలం మన్నాపూర్, రంజోల్ గ్రామాల్లో పంట చేనులో వరద నీరు

పంట చేలను ముంచెత్తిన 'నారింజ'

జహీరాబాద్/కోహీర్, సెప్టెంబరు 2 : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కోహీర్ నారింజ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాగు పరీవాహక ప్రాంతాల్లోని పంటలను ముంచెత్తుతున్నది. ఈ ప్రాంతంలో సాగునీటి వసతులు లేకపోవడంతో వర్షాధారంగా మొక్కజొన్న, పత్తి, సోయా, మినుము తదితర పంటలు సాగు చేస్తారు. వాగు పొంగిపొర్లడంతో ఈ పంటలన్నీ నీట మునిగాయి. వరద నీరు బయటకు వెళ్లిన తరువాతే పంటల పరిస్థితి తెలిసేలా ఉంది.

నియోజకవర్గంలో 560 ఎకరాల్లో పంట నష్టం

కోహీర్, జహీరాబాద్ మండలాల్లో ప్రవహించే నారింజ పరివాహక ప్రాంతంలో 560 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి తెలిపారు. జహీరాబాద్ మండలంలో 413 ఎకరాలు, ఝరాసంగంలో 76 ఎకరాలు, కోహీర్‌లో 75 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వివరించారు. బూచనెల్లి, రంజోల్, సత్వార్, చిరాగ్‌పల్లి, కాశీంపూర్, గోవిందాపూర్, హోతి(బి), హుగ్గెల్లి, కోహీర్‌మండలంలోని కవేలి, కోహీర్, దిగ్వాల్, ఝరాసంగం మండలంలోని క్రిష్ణాపూర్, మాచ్నూర్ తదితర గ్రామాల్లో పంటలకు భారీ నష్టం జరిగినట్టు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.



కోహీర్‌లో నారింజ వాగు పొంగడంతో దెబ్బతిన్న మక్క పంట

వాన ఆగింది..

నష్టం మిగిలింది

భారీ వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లా అతలాకుతలమైంది. ప్రస్తుత సీజన్‌లో రికార్డుస్థాయి వానలు కురవడంతో వరద ప్రవాహం పోటెత్తింది. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వందల ఇళ్లు నేలమట్టం కాగా.. మరికొన్ని పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇక వరద బీభత్సానికి పలుచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖకు కూడా భారీ నష్టం వాటిల్లింది. రెండు రోజులు పాటు వణుకు పుట్టించిన వర్షం ఆగడంతో నష్టం అంచనా వేయడంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది.

- భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లు
- నీట మునిగిన పంటలు
- పలుచోట్ల ధ్వంసమైన ఇళ్లు
- పొంగిపొర్లుతున్న వాగులు
- విద్యుత్‌శాఖకు తప్పని నష్టం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 2: భారీ వర్షాల ప్రభావం నుంచి సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలు కోలుకున్నాయి. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని రెడ్‌అలర్ట్ ప్రకటించారు. కానీ, మోస్తారు నుంచి భారీ వర్షాలు మాత్రమే నమోదుకావడం ఉపశమనాన్ని కలిగించింది. అయినప్పటికీ ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయిలో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా మండలాల్లో 10 సెం.మీ.లకు పైగానే వర్షపాతం కురిసింది. అయితే వరుణుడు శాంతించినప్పటికీ వరద ప్రవాహం మాత్రం తగ్గలేదు.

నీటమునిగిన పంటలు

సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. ఇప్పటికీ పలుచోట్ల పంటు నీళ్లలోనే మునిగి ఉండడం గమనార్హం. సిద్దిపేట జిల్లాలో 1,323 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 655 ఎకరాలు, మెదక్ జిల్లాలో 165 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు పేర్కొన్నారు. మెదక్ జిల్లా హవేళీఘనపురం పెద్దచెరువు కట్ట తెగడంతో 125 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, గజ్వేల్, దౌల్తాబాద్ మండలాల్లోనే వరద ప్రభావంతో పంటలు నీటమునిగాయి. వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లుగా అధికారులు అంచనా వేశారు. ఇక కూరగాయల తోటలూ దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లాలో నారింజ వాగు ముంచెత్తడంతో జహీరాబాద్ డివిజన్‌లో భారీగా పంటలు నీట మునిగాయి. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇళ్లు.. రహదారులు ధ్వంసం

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా సుమారు 400 ఇళ్లు వర్షానికి ధ్వంసమయ్యాయి. ఇందులో కొన్ని నేలమట్టం కాగా.. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు సందర్శించి నమోదు చేసుకున్నారు. ఇక చెరువులు, కుంటల సమీపంలో నిర్మించుకున్న ఇళ్ల చుట్టూ వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకూ నష్టం తప్పలేదు. ఇక వరద ప్రవాహానికి చాలాచోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 25 చోట్ల రహదారులు దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. మెదక్ జిల్లాలో నర్సాపూర్-కుక్కునూరు, జోగిపేట-చిన్నఘన్‌పూర్, ధర్మసాగర్-మంగల్పర్తి, పోతంశెట్టిపల్లి-వెల్దుర్తి, ఏల్పుగొండ ఎక్స్‌రోడ్- ఉత్లూర్ ఎక్స్‌రోడ్ రహదారులు ధ్వంసమైనట్లుగా గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలోనూ రహదారులు కోతకు గురయ్యాయి.

అప్రమత్తమైన యంత్రాంగం

అధికార యంత్రాంగం అప్రమత్తమై నష్ట నివారణ చర్యలు చేపట్టింది. అటు సంగారెడ్డి, మెదక్, ఇటు సిద్దిపేట కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి పెట్టారు. కలెక్టర్లు, ఎస్పీలు, సీపీ సైతం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ప్రాణనష్టాలు సంభవించకుండా పలు రహదారులు, కల్వర్టుల వద్ద రాకపోకలు నిలిపివేశారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాలను దారి మళ్లించడంపై దృష్టిసారించారు. గ్రామాలు, మండలాల ప్రత్యేకాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్‌శాఖకు భారీగా నష్టం సంభవించినట్లుగా తెలుస్తోంది. వరద తాకిడికి విద్యుత్ స్థంబాలు నేలకూలడం, వంగిపోవడంతో వాటిని సరిచేస్తున్నారు. అదేవిధంగా, చెరువులు, కుంటలకు గండ్లు పడిన క్రమంలో నష్టం జరగకుండా చర్యలు చేపట్టారు.



బురదమయంగా సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి రోడ్డు



తూప్రాన్ పరిధి ఆబోతుపల్లి వద్ద వాగు ఉధృతికి దెబ్బతిన్న కాజ్‌వే



వెల్దుర్తిలో అలుగు పారుతున్న చెక్‌డ్యామ్



శివ్వంపేట మండలం పోతుల బొగుడలో వర్షానికి కూలిన ఇల్లు



చిట్కూల్‌లో నీట మునిగిన కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నీలం మధు

పారిశ్రామిక వాడ అతలాకుతలం

పటాన్‌చెరు, సెప్టెంబరు 2: రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు పటాన్‌చెరు పారిశ్రామికవాడ అతలాకుతలమైంది. పారిశ్రామికవాడలోని పీఈటీఎల్ పరిశ్రమతో పాటు పలు కంపెనీల్లోకి వరద నీరు చేరడంతో ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పట్టణంలోని సాకిచెరువు, తిమ్మక్కచెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఔటర్ రింగు రోడ్డు ముత్తంగి జంక్షన్ నుంచి పోచారం మీదుగా ఇంద్రేశం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు పైనుంచి నక్కవాగు ప్రవహించడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపేశారు. చిట్కుల్ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో ఇళ్ల మధ్యకు వరద నీరు చేరింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు పలు ప్రాంతాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు.

సింగూరు @ 19.219 టీఎంసీలు

పుల్‌కల్, సెప్టెంబరు 2: సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి 23,942 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదయింది. ప్రస్తుత నీటి మట్టం 521.290 మీటర్లకు 19.219 టీఎంసీలుగా ఉన్నది.

సింగూరు కాలువకు గండి



ఇసోజిపేటలో గండి పడిన సింగూరు కాలువ

సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువకు సోమవారం గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్నవ వర్షాలకు కాల్వలోకి వరద నీరు భారీగా చేరడంతో పుల్కల్ మండలంలోని ఇసోజీపేట గ్రామశివారులో గండి పడింది. నీరంతా ఇసోజీపేట పెద్దచెరువులోకి ప్రవహిస్తున్నది.

నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

నారాయణఖేడ్/కల్హేర్, సెప్టెంబరు 2: సంగారెడ్డి జిలా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 1,492 అడుగులకు చేరుకుంది. ఎగువన కురిసిన వర్షాలకు సోమవారం 3,300 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 746 ఎంసీఎఫ్‌టీలు కాగా.. ప్రస్తుతం 626 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉన్నట్లు నీటి పారుదలశాఖ డీఈ పవన్‌కుమార్, ఏఈ సూర్యకాంత్ తెలిపారు. అలాగే, నారాయణఖేడ్ మండలంలోని గంగాపూర్ ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది.

జలదిగ్బంధంలోనే ఏడుపాయల వనదుర్గమ్మ

పాపన్నపేట, ఆగస్టు 2: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద సోమవారం మంజీరా ప్రవాహం కొనసాగింది. తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి నిత్యపూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని మూసివేసి, భక్తుల కోసం రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి దర్శనానికి అవకాశం కల్పించారు. ఘనపూర్ వనదుర్గా ప్రాజెక్టు నుంచి 9,237 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తుంది.



ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంజీరా ఉధృతి

అధైర్యపడవద్దు : మెదక్ కలెక్టర్

మెదక్ కల్చరల్/హవేళీఘనపూర్, సెప్టెంబరు 2: ప్రజలు అధైర్యపడొద్దని.. జిల్లా యంత్రాంగం సహాయక చర్యలో నిమగ్నమైందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ మండలంలోని తిమ్మనగర్, రాయిన్‌పూర్, మల్కాపూర్, హవేళీ ఘనపూర్ మండల కేంద్రంలో వర్షం కారణంగా ధ్వంసమైన రోడ్లు, పంటలు, కాలువలు, చెరువులను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణశాఖ సూచనల మేరకు ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనడానికి జిల్లాయంత్రాంగం అప్రమత్తంగా ఉందని అన్నారు. బుంగలు పడిన చెరువులు, తెగిపోయిన రోడ్లకు యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్లు లక్ష్మణ్ బాబు, నవీన్‌కుమార్, నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నారు.

నివేదికలు సిద్ధం చేయండి

మెదక్ అర్బన్ : మెదక్ జిల్లాలో వర్షాలు, నష్టంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 165 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని, 223 ఇళ్లు, 7 ప్రభుత్వ పాఠశాలలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 9 పంచాయతీ రాజ్ రోడ్లు, 11 ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయని వివరించారు. ఒక చెరువు, ఒక కాలువ తెగిపోయాయని వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వరద నష్టం నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ఏడీఏ గోవింద్, డీఈవో రాధాకిషన్, డీఎంహెచ్‌వో శ్రీరాం, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్షానికి కోతకు గురైన తిమ్మానగర్, రాయనపల్లి రోడ్డును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

వినాయక చవితి ఉత్సవాలను
ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● నిర్వాహకులు వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి
● పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలి
● మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 2 : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో సూచించారు. పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా మండపాల నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండప నిర్వహణ, సమాచారం కోసం ప్రత్యేక పోర్టల్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు పూర్తి చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ఫారంతో పాటు అంగీకారపత్రాన్ని సంబంధిత స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా.. పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివిధశాఖల అధికారులతో అనుమతులు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బాలస్వామి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

సమాచారం లేకుండా
విధులకు డుమ్మాకొట్టిన వారిపై చర్యలు

● కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు : డీఎంహెచ్‌వో

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 2: గత నెల 31న కొల్చారం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసినపుడు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీరాం తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రమేష్‌కు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. అయూష్ సిబ్బంది, డాక్టర్ హర్ష, కాంపౌండర్ రజిత, సపోర్టింగ్ స్టాఫ్ పెంటయ్యను ఉద్యోగం నుంచి తొలగించినట్టు వైద్యఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. విధులకు చెప్పాపెట్టకుండా డుమ్మాకొట్టే ఎంతటి స్థాయి ఉద్యోగులైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దుబాయ్‌లో మెదక్‌వాసి మృతి

● మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని ఎంపీకి వినతి


రాట్ల సూర్య(ఫైల్)

మెదక్ అర్బన్, సెప్టెంబరు2: బతుకుదెరువు కోసం దుబాయ్‌కు వెళ్లిన మెదక్ జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రాట్ల సూర్య(34)జీవనోపాధి కోసం గతనెల ఆగస్టు 6న దుబాయ్ వెళ్లాడు. అతను నాలుగు రోజుల క్రితం మరణించినట్లు ఏజెంట్ ద్వారా తెలిసింది. సూర్య మృతి చెందాడన్న వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సూర్య మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు స్థానిక మాజీ సర్పంచ్ ఎలక్షన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ ఇండియన్ ఎంబసీతో మాట్లాడారు. సూర్య మృతదేహం త్వరగా స్వస్థలానికి తీసుకొచ్చేలా చర్యలు చేపడతానని, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. మృతునికి భార్య సరిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా సూర్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కొత్తిమీర ధరకు రెక్కలు

● కిలో రూ.250 చొప్పున విక్రయం


నారాయణఖేడ్‌లో విక్రయానికి వచ్చిన కొత్తిమీర

నారాయణఖేడ్, సెప్టెంబరు2: కొత్తిమీర ధరకు రెక్కలు రావడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు జంకుతున్నారు. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కావడంతో కొత్తిమీరకు డిమాండ్ పెరిగింది. అలాగే నిరంతరం కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల పంట దెబ్బతింది. ఆ ప్రభావం కూడా ధరలు పెరగడానికి కారణం. ఉన్న కొద్దిపాటి కొత్తిమీరను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మార్కెట్‌లో గత వారం కిలో కొత్తిమీర రూ.100 చొప్పున విక్రయించారు. సోమవారం రూ.250 చొప్పున అమ్మారు. రూ.10కి రీటైల్‌గా అమ్మడం లేదని, ఇలా అయితే కొత్తిమీరను కొనడం కష్టమే అని జనాలు చర్చించుకుంటున్నారు.


రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో కూలిన ఇల్లు


అల్లాదుర్గంలో కూలిన ఇల్లు


వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ


కంగ్టిలో వర్షానికి కూలిన ఇంటి వద్ద బాధితురాలు


నిజాంపేట మండలంలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి


చౌటకూరు మండలంలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు దమ్మి పద్మమ్మ

వర్షానికి కూలిన ఇళ్లు.. వరదకు చెరువులకు బుంగలు

మూడు రోజులుగా ముంచెత్తిన వర్షాలతో పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆయా మండలాల రెవెన్యూ అధికారులు ఇళ్లను సందర్శించి నష్ట వివరాల నివేదికను రూపొందిస్తున్నారు.. ఎడతెగని వర్షాలకు వరద నీరు చేరి చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని చోట్ల చెరువులకు బుంగలు పడ్డాయి.

● కంది : కంది మండలం మామిడిపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి కూలిపోయింది. ఎర్దనూర్ నుంచి ఎర్దనూర్ తండాకు వెళ్లే దారిలోని వాగు అలుగు పారుతుండడంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలను సంగారెడ్డి రూరల్ పోలీసులు నిలిపివేశారు.

● సంగారెడ్డి రూరల్ : సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిపేటలో పాత ఇళ్లు వర్షానికి కూలిపోయింది. వర్షానికి రోడ్డు, పాత భవనాలు ధ్వంసమయ్యాయే కాని ఎలాంటి ప్రాణ నష్టం, పెద్దగా ఆస్తినష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

● కంగ్టి : వర్షం ధాటికి మండల కేంద్రమైన కంగ్టిలో సోమవారం గాజుల మహబూబ్‌బికు చెందిన నివాస గృహం కూలింది. కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగించే తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

● నారాయణఖేడ్ : మండలంలోని ర్యాకల్‌తోపాటు నిజాంపేట మండలం బాచేపల్లిలో పలువురి గృహాలు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● పుల్‌కల్ : మండల కేంద్రమైన చౌటకూర్‌లో వర్షానికి తడిసి దమ్మి పద్మమ్మకు చెందిన పెంకుటిల్లు కూలింది. చౌటకూర్ నుంచి పోసానిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో చెట్టు కూలి రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● వట్‌పల్లి : మండలంలోని పోతులబొగుడ గ్రామంలో పత్తి పంట మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు కూలగా తహసీల్దార్ విచారణ జరుపుతున్నారు.

● అల్లాదుర్గం : వర్షం తాకిడికి మండలంలోని ఆయా గ్రామాల్లో గృహాలు కూలిపోయినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసీల్దార్ మల్లయ్య, రెవెన్యూ సిబ్బందితో కలసి పరిశీలించారు. 9 ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ తెలిపారు.

● రేగోడు : వర్షానికి రేగోడు మండలంలో మూడు ఇండ్లు పాక్షికంగా కూలిపోయినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

● నిజాంపేట : మండల కేంద్రంలోని గర్గుల లక్ష్మి చెందిన ఇల్లు కూలిపోయింది. రెవెన్యూ అధికారి ఇల్లును పరిశీలించిన నష్టాన్ని అంచనా వేశారు.

● చిన్నశంకరంపేట : మండలంలోని జంగరాయి వాగు ఉప్పొంగడంతో మత్తడి ధ్వంసం అయింది. చందంపేట చెరువుకు బుంగపడి నీరు వృథాగా పోతుంది. కొన్ని గ్రామాల్లోని ఇళ్లు కూలిపోగా, మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేట, గొట్టిముక్కుల, చీలపల్లి, రామోజీపల్లి, నారాయణపల్లి, తదితర గ్రామాల్లో పలు గృహాలు పాక్షికంగా కూలిపోయాయి. తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆర్ఐ శర్దప్ప ఆయా గ్రామాల్లో కూలిన గృహాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని పేర్కొన్నారు.

● పాపన్నపేట : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 21 ఇళ్లు దెబ్బతిన్నాయి. స్థానిక తహసీల్దార్ సతీష్, ఆర్ఐ శ్రీనివాస్ ఆయా గ్రామాల్లో పర్యటించి నివేదిక తయారు చేస్తున్నారు.

● చిలప్‌చెడ్ : మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో రెడ్డిగల్ల నర్సింలు, గణపురం కిష్టమ్మ, రామస్వామి మల్లాగౌడ్‌ల ఇళ్లలు, సోమక్క పేటలో మచ్చ్యారి బాలయ్య ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సోమవారం ఎంపీడీవో ఆనంద్ ఇళ్లను పరిశీలించారు.

● చేగుంట : మండల పరిదిలో 31 ఇళ్లు కూలిపోయాయని, నష్టం వివరాలను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. ఇళ్లు కూలిన వారిలో కొంతమందికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు.

● రామాయంపేట : మండల పరిధి తొనిగండ్లలోని పులిచేరికుంటకు గండి పడింది. గమనించిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. మెదక్ ఆర్డీవో రమాదేవి అక్కడికి చేరుకుని దగ్గరుండి పూడ్చి వేయించారు. స్థానిక బాలికల వసతి గృహ భవనం గదుల్లో వర్షపునీరు చేరి విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. తహసీల్దార్ భవనంలో లీకేజీలు ఏర్పడి ఫైళ్లు తడిశాయి. లక్ష్మాపూర్‌లో ఓఇళ్లు కూలింది. వందకుపైగా ఎకరాల్లో వరి పంట నీట మునిగింది

● కోహీర్ : మండలంలోని మద్రి గ్రామానికి చెందిన మరియమ్మ ఇల్లు, పర్షపల్లి గ్రామంలో సీరోజమ్మ ఇల్లుతో పాటు మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఆనందం ఇల్లు కూలిపోయింది. కూలిన మూడు ఇళ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేశారు. భారీ వర్షానికి కోహీర్‌లోని పట్లూర్‌బేస్ కాలనీలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. రెండు రోజులు అవుతున్న విద్యుత్ అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని కాలనీవాసులు పేర్కొన్నారు.


● రామచంద్రాపురం : కొల్లూరులోని పెద్దచెరువుల రెండు కాలువలను బిల్డర్లు మూసివేయడంతో చెరువు నిండలేదు. ఇటీవల ఓ బిల్డరు కడుతున్న ఇళ్ల సముదాయాలకు ఆగమేఘాల మీద ఏర్పాటు చేసిన రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ దారి పూర్తిగా చెరువును తలపించింది. రోడ్డుపై మోకాల లోతు నీరు చేరింది. రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌పై కూడ నీరు నిలిచాయి. వరద నీరు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ నాలాపై నుంచి ప్రవహించాయి.


● పటాన్‌చెరు రూరల్ : ముత్తంగి రింగ్ రోడ్డు నుంచి పోచారం వెళ్లే సర్వీస్ రోడ్‌లో నక్క వాగు పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వెళ్లే రహదారిలో ఎల్లమ్మ గుడి సమీపంలో వాగు పొంగి రోడ్డుపైకి నీరు చేరడంతో తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు.

● వెల్దుర్తి : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 12 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి బాధిత వివరాల నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ కృష్ణ తెలిపారు.

● సిద్దిపేట రూరల్ : మండలంలోని రాఘవాపూర్ పెద్దరువు మత్తడికి బుంగపడి నీరు వృథాగా పోవడాన్ని స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు ఎక్స్‌కవేటర్‌తో బుంగను పూడ్చివేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 25 ఇళ్లు కూలిపోయినట్లు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నారాయణరావుపేట వర్షాలకు మండలంలో ఆయా గ్రామాల్లో ఐదు ఇళ్లు కూలినట్లు ఆర్ఐ అర్జున్‌రెడ్డి తెలిపారు.

● వర్గల్ : మండలంలోని శాఖారం గ్రామం వద్ద రహదారిపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌గౌడ్ గ్రామస్థులతో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్, తాళ్ల సహాయంతో వృక్షాన్ని రోడ్డు పక్కకు లాగేసి రోడ్డను క్లియర్‌చేశారు.


చిన్నశంకరంపేట మండలం చందంపేట చెరువుకు పడిన బుంగ


రామాయంపేట మండలం తొనిగండ్లలోని పులిచేరికుంటకు పడిన గండి

పిడుగుపాటుతో పాడిగేదే మృతి

నంగునూరు : పిడుగు పాటుతో పాడిగేదె మృతిచెందిన సంఘటన మండలంలోని అక్కెనపల్లిలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సుద్దాల మహేష్ తన పాడి గేదెను వ్యవసాయ పొలంలో రోజు మాదిరి గానే కట్టివేసి ఇంటికి వెళ్లాడు. పాలు పితికేందుకు వెళ్లి చూడగా పాడి గేదె మృత్యువాత పడింది. సుమారు రూ.80 వేల విలువ ఉంటుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ లింగం అక్కడికి పంచనామా నిర్వహించారు.

ఉధృతంగా జాడీమల్కాపూర్ జలపాతం

కర్ణాటక - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని జాడీమల్కాపూర్, సంగాపూర్ గ్రామాల శివారులో ఉన్న జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. మల్‌చెల్మ, గొటిగార్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి, కర్ణాటకలోని సంగాపూర్ నుంచి వరద నీరు జాడీమల్కాపూర్ జలపాతానికి చేరుతుంది.

-జహీరాబాద్

కూడవెళ్లి పరవళ్లు.. మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

దుబ్బాక : కూడవెళ్లి వాగు పరవళ్లు తొక్కుతున్నది. దుబ్బాక నియోజకవర్గం పొడవునా 54 కిలోమీటర్ల పొడవునా కూడవెళ్లి వాగుపై ఉన్న 36 చెక్‌డ్యాంలు పొంగుతున్నాయి. ఇక్కడి నుంచి నీరు రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీర్‌రావుపేట మండలం ఎగువమానేరు(నర్మాల)ప్రాజెక్టుకు నీరు తరలుతున్నది. రెండు టీఎంసీల నీళ్లు చేరి, 31 పీట్లతో నర్మాల మత్తడి దూకుతుంది. దుబ్బాకలో రామసముద్రం చెరువు, ఏదుల్లా చెరువు మినహా మండలంలోని అన్ని చెరువుల్లో 60శాతం నీరు నిండింది.


నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు జలకళ




కొల్లూరులో చెరువును తలపిస్తున్న ఎక్స్‌టెన్షన్ 7 రేడియల్ రోడ్డు


సదాశివపేటలో కూలిన ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న పులిమామిడి రాజు

వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించిన పులిమామిడి రాజు

సదాశివపేట, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 12వ వార్డులో దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లను సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడిరాజు పట్టణ టౌన్‌ప్లానింగ్ అధికారి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారికి తక్షణమే సహాయం అందించాలని పులిమామిడిరాజు అధికారులను ఆదేశించారు. వార్డులో ఇంటింటి వద్దకు వెళ్లి పులిమామిడిరాజు పారిశుధ్య, విద్యుత్, తాగునీటి సరఫరా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కూలిన ఇళ్ల బాధితుల చేత స్థానిక తహసీల్దార్ కె.సరస్వతికి దరఖాస్తులను ఇప్పించారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


అనూష(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 2 : అత్తవారింటి వేధింపులను తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోచమ్మరాల్ గ్రామానికి చెందిన బొప్పాపురం మల్లిఖార్జున్ భార్య అనూష(22) ఈ నెల 29 తేదీన ఇంట్లో భర్త, అత్తమామలతో గొడవపడి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురైంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను మెదక్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త, అత్తమామలే కారణమంటూ హవేళిఘణపూర్ పోలీస్టేషన్‌కు మృతురాలి బంధువులు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇరు వర్గాలను సముదాయించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనూష తండ్రి బాలేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేస్తుండగా... ఆపరేటర్‌కు కరెంట్‌షాక్

● ప్రస్తుతం నిలకడగా ఆరోగ్యం

గజ్వేల్, సెప్టెంబరు 2: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రైవేటు ఆపరేటర్‌కు విద్యుత్ షాక్ తగిలిన సంఘటన సోమవారం చోటచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ప్రజ్ఞాపూర్ సబ్‌స్టేషన్ నుంచి శ్రీగిరిపల్లి, అక్కారం, కోనాపూర్ గ్రామాలకు వెళ్లే పరిశ్రమల లైన్‌పై శ్రీగిరిపల్లి దుర్గామాత ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య వచ్చిందని, జంపర్ ఎగిరిపోయిందని లైన్‌మెన్ యుగంధర్‌తో పాటు అక్కా రం గ్రామానికి చెందిన ప్రైవేటు ఆపరేటర్ శివ మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ వద్ద ఇండస్ట్రీయల్ లైన్‌తో పాటు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు సంబంధించిన ఎల్‌సీ తీసుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి మంటలు చేలరేగి శివ కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే అతడిని ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ యశోధా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శివ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుత్ తెలిపారని డీఈ భానుప్రకాశ్ తెలిపారు. అంతేకాకుండా ఎల్‌సీ తీసుకున్నా విద్యుత్ సరఫరా ఎలా జరిగిందనే అంశంపై విచారణ జరుపుతున్నామని డీఈ తెలిపారు. కాగా ఆపరేటర్ శివ ఎర్త్ రాడ్ ధరించలేదని తెలుస్తుంది. ఎర్త్‌రాడ్ ధరించి ఉంటే ప్రమాదం తప్పేదని పేర్కొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆపరేటర్ శివ

జపాన్ సకురా సైన్స్ ప్రోగ్రాంకు బీవీఆర్ఐటీ అధ్యాపకుల ఎంపిక

నర్సాపూర్,సెప్టెంబరు 2: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీకి చెందిన నలుగురు అధ్యాపకులు జపాన్‌కు చెందిన సకురా సైన్స్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. బీవీఆర్ఐటీలోని అధ్యాపకులు డాక్టర్ రాజు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ సంతోష జపాన్ స్పాన్సర్ చేసిన సైన్స్ ప్రోగ్రాంకు వెళ్లనున్నారు. వీరు ఔషధమొక్కల డీఎన్ఏ శ్రేణీ విశ్లేషణలో శిక్షణ పొందేందుకు, సాగా యూనివర్సిటీలో పరిశోధన సౌకర్యాలను అన్వేషించడానికి ఈనెల 13వ తేదీ వరకు అక్కడ సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో పాలియేటివ్ కేర్‌తో రక్షణ

● ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు

● రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి


మాట్లాడుతున్న ప్రశాంతి

ములుగు, సెప్టెంబరు 2 : ప్రాణాంతక, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు పాలియేటివ్ కేర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా క్షీరసాగర్‌లోని హంస హోమియోపతి వైద్యశాల, పరిశోధన కేంద్రంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వైద్యంతో రోగి శారీరకంగా, మానసికంగా గట్టెక్కడంతో పాటు జీవన నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు. పాలియేటివ్ కేర్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఇవ్వగా, సరైన చికిత్సలో బాధలను నిరోధించి ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. అలాగే పాలియేటివ్ కేర్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్, ఫార్మాసిస్ట్, ఫిజియోథెరపిస్ట్ తదితర భాగస్వామ్యం ఉంటుందని, ప్రతీ మనిషి జీవితంలో అన్ని రకాల వైద్య వివరాలు వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే, ఈ విధానాన్ని మరింత మెరుగుపరచడానికి జాతీయస్థాయిలో మార్గదర్శకాలు రూపొందిస్తుండగా రోగుల్లో ఉపశమన సంరక్షణ సేవలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లోపతి, ఆయుర్వేద, యునాని, హోమియో, నేచురోపతి సిద్ధ వంటి వైద్య విధానాల ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. హంస హోమియోపతి వైద్య కళాశాల డైరెక్టర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విద్యుత్ సరఫరాపై రైతుల ఆగ్రహం

● గడిపెద్దాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

అల్లాదుర్గం, సెప్టెంబరు 2 : వ్యవసాయ రంగానికి సరఫరా చేసే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి, సబ్‌స్టేషన్ ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా వ్యవసాయ రంగానికి అందించాల్సిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ఇష్టానుసారంగా ఇస్తుండటంతో తీవ్రఇబ్బందులను ఎదుర్కుంటున్నామన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా తమ గోడు పెడచెవిన పెడుతున్నారని వారు ఆవేదనను వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందిస్తూ ఇకపై విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారుల హామీతో రైతులు ఈ ఆందోళన విరమించారు.


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దాదాయిపల్లి రైతులు

భూమికి భూమి.. లేదంటే మార్కెట్ రేటు

● అలా అయితేనే ఆర్ఆర్ఆర్‌కు మా భూములిస్తాం

● అధికారులకు తేల్చి చెప్పిన ప్రాజెక్టు ఉత్తర భాగం రైతులు

జోగిపేట, సెప్టెంబరు 2: రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో భాగంగా ఉత్తరం వైపున భూములు కోల్పోనున్న రైతులతో సోమవారం సంగారెడ్డి జిల్లా అందోలు-జోగిపేట ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ విభాగం, ఎన్‌హెచ్ఏఐ అధికారులు సంయుక్తంగా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో పాండు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చౌటకూరు, జోగిపేట మండలానికి చెందిన కొర్పోలు, శివంపేట, అంగడిపేట, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. "భూమికి భూమి.. లేదంటే మార్కెట్ రేటు చెల్లిస్తేనే మా భూములిస్తాం" అని వారు అధికారులకు తేల్చి చెప్పారు. "మా ఊర్లో ఎకరాకు రూ.2-3కోట్లు ఉంటే.. ప్రభుత్వం రూ.21లక్షలు ఇస్తామనడం న్యాయమా" అని శివంపేట గ్రామస్థులు మండిపడ్డారు. గతంలో జేఎన్టీయూ కోసమని చెప్పి, నాలుగు వరుసల రోడ్డు అని చెప్పి తమ భూములు లాక్కున్నారని వారు గుర్తు చేశారు. "ఉన్న భూమిని మీకిస్తే.. మేం బతికేదెట్లా" అని అధికారులను నిలదీశారు. వెంకటకిష్టాపూర్, అంగడిపేట, లింగంపల్లి గ్రామాల వాసులేమో... తమ గ్రామంలో మార్కెట్ రేటు రూ.50 లక్షలుందని, కానీ ప్రభుత్వం కేవలం రూ.6 లక్షలిస్తామంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో పాండు మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించే ఆలోచనలో ఉందని చెప్పారు. రైతులంతా సహకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు.


అవగాహనా సదస్సులో అధికారులను నిలదీస్తున్న రైతులు

చెల్లి కనిపించలేదని అన్న, గొడవపడ్డాడని చెల్లి ఆత్మహత్య

● అంతకుముందు ఇద్దరి మధ్య గొడవ

● ఇంట్లో నుంచి వెళ్లి నీటి కుంటలోకి దూకిన సోదరి

● చెల్లి ఆచూకీ చిక్కకపోవడంతో పురుగుల మందు తాగిన అన్న


కల్యాణి(ఫైల్)

దౌల్తాబాద్, సెప్టెంబర్ 2 : చిన్నగొడవ వల్ల మనస్తాపంతో అన్నాచెల్లెలు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుప్రియాల్‌కు చెందిన కాసులాబాద్ శ్యామల, కిష్టయ్యకు ముగ్గురు సంతానం. అనారోగ్యంతో శ్యామల కొద్దిరోజుల క్రితం మృతి చెందింది. పెద్దకొడుకు మహేష్, రెండవ కొడుకు రాము, కూతురు కల్యాణి తండ్రి కిష్టయ్యతో కలిసి ఉంటున్నారు. శనివారం రాత్రి తండ్రి కిష్టయ్యకు, రాముకు మధ్య గొడవ జరిగింది. వారిని సముదాయించేందుకు వెళ్లిన కల్యాణితో రాము గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో రాము, కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. తన వల్లే ఇదంతా జరిగింది అనుకుని మనస్తాపంతో రాము పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి, ఆ తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం రాము మృతిచెందాడు. అప్పటికే ఇంట్లో నుంచి వెళ్లిన కల్యాణి నీటి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాము(ఫైల్)

రాత్రికిరాత్రే పరిశ్రమకు తాళం

● రోడ్డున పడిన కార్మికులు

మనోహరాబాద్, సెప్టెంబర్ 2: రాత్రికిరాత్రే పరిశ్రమకు తాళం వేయడంతో కంపెనీ వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నారు. పదిరోజులుగా ఆందోళన చేస్తున్నా కార్మికులను పట్టించుకునే వారు కరువయ్యారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి ఆనుకుని మైకో సిడ్ పరిశ్రమ ఉంది. ఇందులో కొందరు కార్మికులు 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ఈనెల 21వ తేదీన ఎవరికీ చెప్పకుండా రాత్రికిరాత్రి పరిశ్రమ గేట్‌కు తాళం వేసి, నోటీసు అంటించారు. ఉదయం వెళ్లిచూడగా పరిశ్రమ మూసివేసి ఉండడంతో కార్మికులు విస్తుపోయారు. దీంతో కార్మికులు నిరసన బాట పట్టారు. పరిశ్రమ ఎదుట పదిరోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. పరిశ్రమను ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని ఆందోళన చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ నాయకుడు చంద్రారెడ్డి పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.


కాళ్లకల్‌లోని మైకో పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కాలువను తలపిస్తున్నదృశ్యం



సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



కంది: ఎర్దనూర్ నుంచి ఎర్దనూర్ తండాకు వెళ్లే దారిలో రాకపోకలు బంద్ చేసిన పోలీసులు



నారాయణఖేడ్: గంగాపూర్‌ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తున్నదృశ్యం

తెరిపిలేని వర్షాలు.. అధ్వానంగా రోడ్లు



జహీరాబాద్: డౌన్‌టౌన్ నుంచి బీదర్‌చౌరస్తాకు వెళ్ళే రోడ్డుపై ప్రవహిస్తున్నవరదనీరు

గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు వర్షం నీటితో వరదకాలువలను తలపిస్తున్నాయి. పలుచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. సోమవారం కూడా వాహనాల రాకపోకలు దాదాపుగా స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలుచోట్ల నీట మునిగిన పంటలను అధికారులు పరిశీలించారు.

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు వరద నీటితో నిండి కాలువలుగా తలపించాయి. మండలంలోని ఇరిగిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటితో నిండి కాలువలా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతు రుణమాఫీ సర్వేకోసం గ్రామాల్లో పర్యటించాల్సిన అధికారులు వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చి వివరాలు సమర్పించాలని సూచించడం గమనార్హం. ఫసల్‌వాది గ్రామ సమీపంలో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లే రోడ్డు చిత్తడిగా మారింది.

● కంది: మండలంలో సోమవారం ఎడతెరిపి లేని వాన కురిసింది. కాశీపూర్‌లో పొంగి పొర్లుతున్న అలుగుపై రాకపోకలు సాగించలేక ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో మహేందర్‌రెడ్డిలు అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలను పరిశీలించారు.

● జిన్నారం, సెప్టెంబరు 2: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలను తహసీల్దార్, ఆర్‌ఐలు పరిశీలించారు. సోమవారం తహసీల్దార్ భిక్షపతి, ఆర్‌ఐ జయప్రకాష్‌లు వివిధ గ్రామాల్లో వర్షాలతో నిండిన చెరువులు, కుంటలను పరిశీలించారు. తూములు, అలుగుల పటిష్ఠతను పరిశీలించి, స్థానికులతో అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని జిన్నారం, ఊట్ల గ్రామాల చెరువులను ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. సోమవారం ఇరిగేషన్ ఈఈ భీమ్ ఊట్ల పెద్ద చెరువు పరిశీలించారు. చెరువు అలుగు వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని ఏఈ రామస్వామికి ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ మహేష్, నియోజకవర్గ మత్స్య సంఘం అధ్యక్షురాలు నీలం లత తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్: అల్గోల్ వెళ్లే రోడ్డుపై అధికారులు ఏర్పాటుచేసిన బారికేడ్లు

● జహీరాబాద్: ఎడతెరిపి లేని వర్షాల ప్రభావంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రోడ్లు పూర్తిగ ధ్వంసమయ్యాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. జహీరాబాద్ పట్టణంలోని డౌన్‌టౌన్ వద్ద గల బైపాస్ మీదుగ అల్లానా కర్మాగారం మీదుగ బీదర్ చౌరస్తా వరకు, అల్గోల్ చౌరస్తా నుంచి పొట్టిపల్లి వరకు, రాంనగర్‌నుండి చిన్నాహైదరాబాద్‌కు వెళ్ళేరోడ్డు, పట్టణంలోని బాగారెడ్డి విగ్రహం వద్దనుండి తాండూర్ వెళ్ళేరోడ్డు శేఖాపూర్ వరకు, ఇలా ప్రధానరోడ్లన్నీ పూర్తిగ దెబ్బతిన్నాయి. ధ్వంసమైన రోడ్ల గుండా వెళ్లొద్దంటూ అధికారులు హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి-ధనసిరి గ్రామాల మధ్యలో ప్రధానరోడ్డుపై ఏర్పాటుచేసిన కల్వర్టు వరదనీటి దాటికి తెగిపోవడంతో అక్కడ కూడా అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే కోహీర్‌చౌరస్తా మొదలుకుని ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి, జీర్లపల్లి వరకుఉన్న రోడ్డు పూర్తిగపాడైంది. అలాగే జహీరాబాద్ మండలంలోని 65వనెంబర్ జాతీయరహదారి నుండి బిడకన్నె మీదుగ క్రిష్టాపూర్ వరకు వెళ్ళేరోడ్డు, మండలంలోని శేఖాపూర్‌మొదలుకుని పర్వపల్లి మీదుగా బడంపేటవరకు ఉన్నరోడ్డుతో పాటు ఇతర ప్రధాన రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇదిలా ఉండగ వర్షాల ప్రభావంతో సోయా, పెసర, మొక్కజొన్న, చెరకు, అల్లం, పత్తి, మినుము తదితర పంటలు నీట మునిగాయి. కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో నష్టాన్ని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. కాగా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల నారింజ ప్రాజెక్టును సోమవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురితో కలిసి పరిశీలిచారు. నారింజ ప్రాజెక్టు వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్డీవో రాజు, తహసీల్దార్ రవీందర్ ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



జహీరాబాద్: రంజోల్‌లో పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

●నారాయణఖేడ్: నారాయణఖేడ్‌మండలంలోని గంగాపూర్‌ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల చేతికందే దశలోఉన్న పెసర, మినుము,పంటలకు నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటాపూర్ శివారులోపత్తి పొలాల్లో వర్షంనీరు చేరడంతో పత్తి మొక్కలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖేడ్ తహసీల్దార్ భాస్కర్, ఆర్‌ఐ మాధవరెడ్డితో కలిసి మండలంలోని పలు గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

● కంగ్టి: మండలంలోని తడ్కల్, చాప్టా, కంగ్టి తదితర గ్రామాల్లోని చెరువులను సోమవారం తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. దీంతో పాటుపలుగ్రామాల్లో పారిశుధ్యపనులను పరిశీలించి మురికికాలువలుశుభ్రం చేయించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకుఅవగాహన కల్పించారు.

● నాగల్‌గిద్ద: మండల పరిధిలోని శేరిదామర్‌గిద్ద గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయ అధికారిప్రవీణ్, ఏఈవో సంతోష్ గ్రామ శివారులో సాగు చేస్తున్న సోయాబీన్, పత్తిపంటలను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. వారి వెంట మాజీ ఎంపీటీసీపండరినాథ్‌రావు, రైతులు పాల్గొన్నారు.

● రేగోడు సెప్టెంబరు 1: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రేగోడు ఊరకుంటతో పాటు ఆయా గ్రామాల్లోని కుంటలు, వాగులకు జలకళ ఉట్టిపడుతోంది. మండలంలోని కొండాపూర్ - జగిర్యాల చెరువు తూము నుంచినీరు వృధాగా పోతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ బాలలక్ష్మి, ఎమ్మారై ఫిరోజ్ చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. నీటి వృధాగా పోతున్న తూమును మట్టితో పూడ్చివేశారు.



జహీరాబాద్: నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, తదితరులు

● పాపన్నపేట: మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. మంజీరా నదికి వరద ప్రవాహం పెరగడంతో నదీపరివాహక గ్రామాల శివార్లలో ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నారం గ్రామాన్ని ఆమె సందర్శించారు. వరదలు వస్తున్నందున నదులు, చెరువులు వద్దకు ప్రజలు వెళ్లొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మార్వో సతీష్, ఆర్‌ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జగదీశ్, తదితరులున్నారు.

● నిజాంపేట: నిజాంపేట మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని చెరువులు కుంటలు ఎడతెరిపి లేని వర్షాలతో జలకళను సంతరించుకున్నాయి. మండల కేంద్రంలోని మల్కాచెరువు పూర్తిగా నిండి మత్తడి దూకుతుంది. ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి అలుగు పారుతున్న మత్తడి సమీపంలో ఈతలు కొడుతూ సెల్ఫీలు దిగి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలుగు ద్వారా చెరువులో నుంచి దూకుతున్న చేపలను మత్స్యకారులు వలలు వేసి పట్టుకున్నారు.



నిజాంపేట: అలుగు పారుతున్న మల్కా చెరువు





రేగోడులో నిండిన ఊరకుంట, రేగోడు మండలం కొండాపూర్ చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



వెల్దుర్తి: అలుగు పోస్తున్న వెల్దుర్తి చెక్‌డ్యామ్



చిన్నశంకరంపేట: పొంగిపొర్లుతున్న జంగరాయి వాగు

జహీరాబాద్‌లో బైకుల దొంగల అరెస్ట్



బైకుల దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు

జహీరాబాద్, సెప్టెంబరు 2: పట్టణంలోని అల్గోల్ వెళ్లే రోడ్డుపై సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు ముగ్గురు బైక్ దొంగలను అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మచ్చూరీ వినోద్‌కుమార్(రాయికోడ్-శంషుద్దీన్‌పూర్), మహ్మద్‌జుబేర్(బాబుమోహన్‌కాలనీ-జహీరాబాద్), మహ్మద్ షఫీ (శాంతినగర్-జహీరాబాద్)లు కలిసి వేర్వేరు బైకులపై సరైన పత్రాలు లేకుండా వెళ్తూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని విచారించగా.. వారంతా గత ఆరు నెలల కాలంలో సదాశివపేట, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో 25 వివిధ రకాల బైకులను దొంగిలించారు. బైకులను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచామన్నారు. బైకుల దొంగతనాన్ని ఛేధించిన ఎస్ కాశీనాథ్‌ను జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు

వినాయకచవితి పండుగ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ తమకు సహకరించాలని పట్టణ ఎస్ఐ. కాశీనాథ్, జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాదరావులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పద్మశాలీభవన్‌లో వినాయవిగ్రహాల మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏదైనా సమస్య ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. పరస్పర సహకారంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామన్నారు.

'తెల్లాపూర్‌లో చెరువుల్లోని ఆక్రమణలు తొలగించండి'

రామచంద్రాపురం, సెప్టెంబరు 2: తెల్లాపూర్‌లోని మూడు చెరువులు కబ్జాబారిన పడినట్లు చెరువుకట్ట మాజీ ఛైర్మన్ వడ్డె నర్సింహులు సోమవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత రికార్డులను ఫిర్యాదు పత్రంతో పొందుపర్చారు. హైడ్రా కమిషనర్ లేకపోవడంతో అక్కడ ఉన్న మరో అధికారికి ఫిర్యాదు పత్రం అందించామన్నారు. సదరు అధికారి రెండు వారాల్లోగా తెల్లాపూర్ చెరువులను కమిషనర్ సందర్శించి తగు చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారని నర్సింహులు పేర్కొన్నారు.

కాళ్లకల్‌లో కుంటలను చెరువులను కాపాడాలి



మెదక్ ఏడీకి ఫిర్యాదు చేస్తున్న కాళ్లకల్ గ్రామస్థులు

మనోహరాబాద్, సెప్టెంబర్ 2: మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఉన్న చెరువులు కుంటలను కాపాడాలని కాళ్లకల్ గ్రామస్థులు మెదక్ కలెక్టరేట్ ప్రజావాణి కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. మనోహరాబాద్ మండలం 44 వ జాతీయ రహదారికి పక్కన కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ ఉండగా, గ్రామ శివారులో సుమారు చిన్న పెద్ద పరిశ్రమలు సుమారు 100 వరకు ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాళ్లకల్ గ్రామంలోని గతంలో సర్వే నెంబర్ 3లో హనుమాన్ ఆలయం 0.05 గుంటలు, సర్వే నెంబర్ 87లో గార్లకుంట శికం 14.23 గుంటలు, సర్వే నెంబర్ 115 లో ఎర్రకుంట 9 ఏకరాలు, సర్వే నెంబర్ 116 లో మామిడి కుంట శికం 11.26 ఎకరాలు, సర్వే నెంబర్ 164 లో వడ్లవాణి కుంట 5.01 ఎకరాలు, సర్వే నెంబర్ 175 లో లక్ష్మీనర్సింహస్వామి ఆలయం 3.13 ఎకరాల కుంటల భూములు ఉన్నాయని ఫిర్యాదులో తెలిపారు. కానీ ఇప్పుడు ఈ కుంటలు ఎక్కడా ఉన్నాయో తెలియడం లేదని, ఆక్రమణలకు గురయ్యాయన్నారు. కొంతమంది సర్వే నెంబర్లు లేకున్నా భూములను కబ్జా చేసి వేరే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకొని భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

డ్రైవర్లు బస్సులను జాగ్రత్తగా నడపాలి: డీఎం

నారాయణఖేడ్, సెప్టెంబరు 2: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకుచేర్చడం కోసం ఆర్టీసీ బస్సులను ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తగా నడపాలని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య డ్రైవర్లకు సూచించారు. సోమవారం డిపో పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద అసిస్టెంట్ మేనేజర్ నర్సింలు, పీఆర్వో పాండు, కంట్రోలర్ నెహ్రూ నాయక్‌లతో కలిసి బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తూ డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. ప్రజలకు ఆర్టీసీ పరంగా ఇబ్బందులు ఎదురైతే 9959223170 లేదా 9704885694 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఖేడ్‌లో ఘనంగా పొలాల అమావాస్య



పొలాల అమావాస్య సందర్భంగా అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్న రైతులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 2: నారాయణఖేడ్ ప్రాంతంలో సోమవారం పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పశువులకు రంగుల సామగ్రితో అలంకరించి, వాటికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని ఆలయాల చుట్టూ తిప్పి పాడిపంటలు చక్కగా ఉండాలని మొక్కుకున్నారు. ఈ అమావాస్యవేడుకలను పురస్కరించుకొని సోమవారం ఖేడ్‌పట్టణంలోని పశువులఅలంకరణ సామగ్రి దుకాణాల వద్ద సందడి నెలకొంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఖేడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్,సెప్టెంబరు 2:నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటలోని పలువురు లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్ ఛైర్మన్‌దారం శంకర్, తదితరులు ఉన్నారు. కాగా శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్‌పట్టణంలోని దత్తాత్రేయ ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికారు.

'అధికారులు అందుబాటులో ఉండాలి'

రామచంద్రాపురం, సెప్టెంబరు 2: విపత్తు సమయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జీహెచ్‌ఎంసీ 111 డివిజన్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎల్‌ఐజీ వార్డు కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కార్పొరేటర్ సమావేశాన్ని నిర్వహించారు. వార్డు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను విధిగా నమోదు చేయాలన్నారు. ఎక్కడా చెత్తలేకుండా పారిశుధ్య కార్మికులు చూడాన్నారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గోపాల కాల్వల ఊరేగింపు



ఈశ్వర ఆలయంలో భక్తుల అభిషేకం

పాపన్నపేట, ఆగస్టు 2: మండల కేంద్రంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరిచుకొని పద్మశాలీసంఘం ఆధ్వర్యంలో గోపాల కాల్వలు(ఉట్టి కొట్టే) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్థానిక ఈశ్వరాలయంలో స్వామివారికి లింగాభిషేకం, నవగ్రహ పూజా నైవేద్యం సమర్పణ, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధులగుండా గోపాల కాల్వలు ఊరేగించి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈశ్వరాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

కంది, సెప్టెంబరు 2: తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫోరం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కందిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడిగా సిద్ధేశ్వర్‌ను, ప్రధానకార్యదర్శిగా చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, వసీం, సుమలత, కార్యదర్శులుగా శ్రీధర్, నళిని, మధు, వినీల, జిల్లా కౌన్సిలర్లుగా సుదర్శన్‌గౌడ్, యాదగిరి, బి.నర్సింలు, ఎన్.నర్సింలు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాస్, సభ్యులుగా శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు ఉపాధ్యయుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

ఎంజేపీ సొసైటీ ఇన్‌చార్జి ఆర్‌సీవోగా సంతోషి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 2: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ ఇన్‌చార్జి ఆర్‌సీవోగా(రీజినల్ కో ఆర్డినేటర్)సంతోషి నియమితులయ్యారు. ఇది వరకు ఆర్‌సీవోగా పనిచేసిన ప్రభాకర్ గత నెల 31 న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి రీజినల్ కో ఆర్డినేటర్‌గా సదాశివపేట మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల(సంగారెడ్డి) ప్రిన్సిపాల్ సంతోషికి అప్పగించారు.

ఘనంగా ఎల్ఐసీ 68వ వార్షికోత్సవం



మెదక్ బ్రాంచ్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 2: ఇన్సూరెన్స్ రంగంలో మార్కెట్ లీడర్ ఎల్ఐసీ అని మెదక్ ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ పూర్ణచందర్ రాజ్ పేర్కొన్నారు. ఎల్ఐసీ 68వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మెదక్ బ్రాంచ్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ భారతీయుడికి ఒక ఎల్ఐసీ పాలసీ అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ శంకర్, రవి, బాలయ్య ఏజెంట్లు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● మెదక్ ఎంపీకి వినతి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 2: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, నాగరాజు, శ్రీనివాసరాజు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వీరభద్రస్వామి ఆలయంలో

సోమవతి అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 2: పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు సామూహిక అభిషేక కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారికి అఖండ హారతి సమర్పించారు. సాయంత్రం భక్తులచే బిల్వార్చన పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 2: శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయంలో 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయంలోని గర్భగుడిలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు.

జోగిపేటలో శ్రావణమాస పూజలు

జోగిపేట, సెప్టెంబరు2: పట్టణంలోని పుట్టపర్తి సాయి మందిరంలో సోమవారం శ్రావణ మాస ముగింపు ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో లక్ష్మీగణపతి యజ్ఞం నిర్వహించారు. అనంతరం, పుట్టపర్తి యాత్ర కృతజ్ఞతా సమావేశాన్ని నిర్వహించారు. యాత్రలో సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి

జహీరాబాద్, సెప్టెంబరు 2: శ్రావణమాసం ఆఖరి సోమవారం, అమావాస్య తిథి రావడంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి చోటు చేసుకున్నది. జహీరాబాద్ పట్టణంలోని శివాలయం, సిద్దేశ్వరాలయం, సోమేశ్వరాలయం తదితర ఆలయాల్లో భక్తులు బారులు తీరారు.

● కోహీర్: మండల పరిధిలోని బడంపేటలో గల శ్రీ రాచన్నస్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు కొనసాగిన లక్ష బిల్వార్చన కార్యక్రమం మంగళవారంతో ముగియనున్నది. చివరి రోజైన మంగళవారం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కల్యాణంతో బిల్వార్చన ముగుస్తుంది.

● నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని కాశీనాథ్ ఆలయంలో సోమావతి అమావాస్యను పురస్కరించుకొని మహారుద్ర యాగం, రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను పురోహితులు గురురాజ్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీసురేష్ షెట్కార్ సతీమణి ఉమాదేవి, మాజీ జడ్పీటీసీ సంగీత జితేందర్‌నాథ్‌షెట్కార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్ ఛైర్మన్ దారం శంకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● మెదక్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలోని శ్రీ భవానీచిదంబర స్వామి శివాలయంలో సోమవతి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మనగారి కృష్ణారావు శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, మహాన్యాసపూర్వక, బిల్వార్చ, పుష్పార్చన, రుద్రహోమం తదితర విశేష పూజ కార్యక్రమాలు జరిగాయి. ఆవరణలో ఉన్న రాగి చెట్టుకు మహిళలు 108 సార్లు ప్రదక్షిణలు చేశారు.



మెదక్‌లోని కోదండ రామాలయంలోని రాగి చెట్టుకు పూజలు

వైఎస్సార్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ 15వ వర్ధంతిని సోమవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు ఘన నివాళులర్పించారు.

నర్సాపూర్, సెప్టెంబరు 2: నర్సాపూర్‌లో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, యువజననాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చేగుంట: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్, మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డిల వర్ధంతి కార్యక్రమాలను నార్సింగి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల అధ్యక్షుడు అకుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్, ముత్యంరెడ్డి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



నర్సాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

● మాసాయిపేట: మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీటీసీ కృష్ణారెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నారాయణఖేడ్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి కొనియాడారు. సోమవారం ఖేడ్‌లోని ఆయన గృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ ఛైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్‌నాయకులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా మాజీమంత్రి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే చెరకు ముత్యంరెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా తొగుటలో నిర్వహించిన కార్యక్రమంలోస్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఆయన సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని నివాళులర్పించారు.

● రామచంద్రాపురం: తెల్లాపూర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీపీ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, అరుణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.